● కథానిక




# ముసుగు

అల్లూరి గౌరీలక్ష్మి



"నిజం చెప్ప కవీ! ఇంట్లో వాళ్ళతో కంటే ఫ్రెండ్స్‌తో ప్రయాణం చాలా హేపీగా వుంటుంది కదూ!" అడిగింది భానూ ట్రెయిన్‌లో సామానంత సర్ది కిటికీ పక్కన కూర్చుంటూ.

"అవును పాపం!" ముద్దుగా వెక్కిరించింది కవిత భానూ పక్కన కూర్చుంటూ. భానూ, కవితలు తిరుపతిలో ఎం.బి.బి.ఎస్. మూడో సంవత్సరం చదువుతున్నారు. శలవులకి బలవంతంగా కవితను వాళ్ళ ఊరికి తీసుకుపోతున్నది భానూ. కవితకు చాలా మొహమాటంగా వుంది. ఆమెకసలు కొత్తవాళ్ళతో కలిసే అలవాటు లేదు. అయినా ఈ ప్రయాణం తప్పలేదు కవితకు.

"అసలు నిన్ను మా ఊరికి తీసుకెళ్ళాలని ఎప్పట్నించో కోరిక. అదిప్పటికి తీరుతోంది. కవీ! మా మావయ్య కూడా గుంటూరులోనే వుంటాడు తెలుసా! పేరు శేఖర్. ఎం.డి. చేశాడు. పెద్ద హాస్పటల్ కట్టుకున్నాడు. మా మావయ్యకు నేనంటే చాలా ఇష్టం. తనే నన్ను ఎంసెట్‌కు ప్రిపేర్ చేశాడు.

నాకంటే పదేళ్ళు పెద్దవాడు. పెళ్ళయి రెండేళ్ళయ్యింది. "భానూ గలగలా చెప్తకుపోతుంది. కవిపించిన వల్లా కొనేస్తూ.

"మీ అత్తయ్య కూడా డాక్టరా!" అడిగింది కవిత.

"కాదులే. ఆమె బి.కాం. చదివింది ఆమెక్కూడా నేనంటే చాలా ఇష్టం. నువ్వసలు మా మావయ్యను చూస్తే ఫ్రెండ్ షిప్ చేసేస్తావ్. అంత బాగా మాట్లాడతాడు. పైగా సినిమా హీరోలా వుంటాడు.

"సర్లేగానీ, నన్ను మాత్రం తొందరగా పంపించెయ్యి" అంది కవిత.

"వెళ్ళిపోక వుండిపోతావా ఏమిటి? కొత్త చోటికి వెళ్ళినప్పుడు కొత్త ప్రదేశాలు చూసే అవకాశం కలిగిందని ఆనందించాలి కానీ వున్నంతసేపూ అనీజీ ఫీలయిపోతూ ఎప్పుడెప్పుడు వెళ్ళిపోదామా అనుకోకూడదు. అలా అయితే లైఫ్ ఎంజాయ్ చెయ్యలేమే!" ఉపన్యాసం ఇచ్చింది భానూ.

భానూ తల్లీ, తండ్రీ స్టేషన్ కొచ్చి రిసీవ్ చేసుకున్నారు. "ఏమ్మా కవితా బావున్నావా! మా భానూ ప్రతిసారీ నిన్ను తీసుకు వస్తాననేది. ఇప్పటికి సాధించింది" ఆప్యాయంగా భానూ తల్లి పలకరించింది. కవిత ఆమెను చూసి నమస్కారం చేసింది. భానూ తండ్రి కూడా "ఏమ్మా" అని పలకరించాడు. అతనికి కూడా నమస్కరించింది కవిత.

ఇంటికి వెళ్ళిన తర్వాత భానూ చేసిన అల్లరి అంతా ఇంతా కాదు. కవితకిష్టమైనవన్నీ తల్లిచేత తయారు చేయించింది. శేఖర్‌కి ఫోన్ చేసింది. "మామాశ్రీ! నేనొచ్చేశాను. మా ఫ్రెండ్‌ని కూడా తెచ్చాను. బాయ్ ఫ్రెండ్ కాదు. గర్ల్ ఫ్రెండే. నువ్వెప్పుడొస్తావ్?" అంటూ. సాయంత్రం హాస్పటల్ నుంచి నేరుగా వస్తానన్నాడు శేఖర్.

మధ్యాహ్నం కవితను తీసుకుని ఊరంతా తప్పి చూపించింది భాను. తన బాల్యమంతా అక్కడ ఎలాగడిచిందో

"సినిమాల్లో, కథల్లోనూ చెడ్డవాళ్ళు మంచివాళ్ళు అంటూ నిజ జీవితంలో విడివిడిగా ఉండరు"

అంతా వివరించింది. తను చదివిన ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలూ చూపించింది. అక్కడి నుండి ఆమె తండ్రి స్టెయిన్ లెస్ స్టీల్ షాపుకి వెళ్ళారు. చాలా పెద్ద షాపది. కష్టమర్తో రద్దీగా కళకళలాడుతున్నది.

భామా తండ్రి "బాగా చదవాలమ్మా మీరిద్దరూ!" అన్నాడు. "భామా ఎంతల్లరి చేస్తుందో అంత బాగానూ చదువుతుందండీ" కవిత చెప్పింది నవ్వుతూ. ఆయన ఆనందంగా నవ్వాడు.

"వస్తాం డాడీ!" అంటూ కవితను తీసుకుని ఇంటికి బయలుదేరింది భామా.

రాత్రి తొమ్మిది గంటలకి మారుతీ హారన్ వింటూనే "మావయ్యా" అంటూ బైటికి పరుగు తీసింది భాను. శేఖర్ చెయ్యి పట్టుకుని లోపలికి వచ్చింది. "నా డియరెస్ట్ ఫ్రెండ్ కవిత" పరిచయం చేసింది అతనికి.

శేఖర్ భామా చెప్పినట్టుగానే చాలా హాండ్‌సమ్‌గా వున్నాడు. అంతే స్టైల్‌గా విష్ చేశాడు. గ్లాడ్ టూ మీట్ యూ!" అంటూ చిన్నగా నవ్వింది కవిత.

శేఖర్‌కి కవిత అందం అద్భుతమైన హాయిని కలిగించింది. అది అతని కళ్ళలో స్పష్టంగా ప్రతిఫలించింది కూడా.

"అక్కయ్యా! భామా వచ్చింది కదూ! పనులన్నీ తనకి చెప్పి నువ్వు రెస్ట్ తీసుకో" అన్నాడు శేఖర్ భామా తల్లితో.

"నేను పనులు చెయ్యడానికొచ్చానా?" అంది భామా బుంగమూతితో

"ఓ! సారీ! పనులు కల్పించడానికొచ్చినట్టున్నావ్ కదూ!"

మేనకోడల్ని వెక్కిరించాడు.

"మీరింత నాజూగ్గా ఎందుకున్నారో మీ తిండి చూడకముందే నాకు తెలిసింది కవితగారూ" భోజనాల దగ్గరన్నాడు శేఖర్ నవ్వుతూ.

"ఎలాగబ్బా!" ఆశ్చర్యపోయింది భామా.

"నువ్వు కవితను ఎన్ని రకాలుగా ఫ్రై చేసి తింటావో కదా!"

"అంటే నీ ఉద్దేశం మావయ్యా?"

"పెద్ద ఉద్దేశ్యం ఏమీ లేదనుకో. కంటిన్యుయస్ హేమరింగ్ వేస్తూ డే అండ్ నైట్ ప్రశాంతంగా ఉండనివ్వవని అంతే".

"ఏం కాదు. కవితకి నేనంటే ఎంత ప్రేమ లేకపోతే ఇక్కడి కొస్తుందమ్మా!" విస్ఫారంగా అంది భామా.

"నువ్వు బలవంతంగా టిక్కెట్ కొని ట్రెయిన్‌లో పడేసుంటావ్. నీ లగేజీ తోపాటు" శేఖర్ మాటలకు అందరూ హాయిగా నవ్వారు.

"అత్తయ్యేలా వుంది మావయ్యా?" భామా అడిగింది నవ్వాపుకుంటూ.

"పుట్టింటికెళ్ళిందిలే నీలాగే. మీరిద్దరూ బోర్‌కొడితే మా క్లినిక్‌కి వచ్చెయ్యండి. సిక్స్ టూ నైన్ అవుట్ పేషెంట్స్ వస్తూంటారు. ముగ్గురం కలిసి చూడొచ్చు సరదాగా" ఇద్దర్నీ ఆహ్వానించాడు శేఖర్.

"ఓ.కే. మావయ్యా వస్తాం" అంది భాను. శేఖర్ ఫోంచేసి వెళ్ళిపోయాడు. మర్నాడంతా ఇంట్లోనే వుండి వి.సి.ఆర్.లో కావలసిన సినిమాలు చూస్తూ గడిపారు భామా, కవితలు.

ఏయ్! భామా! అందర్నీ చూశాను. ఊరు చూశాను. ఇంక నన్ను పంపించెయ్యకూడదూ!" బ్రతిమాలింది కవిత.

"మీ డాడీకి వారం రోజులుంటానని లెటర్ రాసి ఒక్క రోజుండి వెళ్ళిపోతావా? మావయ్యన్నట్టు నిన్ను బలవంతంగా తీసుకొచ్చాను. కానీ నువ్వసలు ప్రేమతో రానే లేదు" బాధగా అంది భాను.

"పిచ్చీ! ప్రేమ లేనప్పుడు బలవంతం చేస్తే మాత్రం వచ్చేదాన్నా! సరే. బైటికి పోదామా!" అడిగింది కవిత.

"నువ్వేదంటే అదే. కానీ ఇంకో రెండు రోజులుండు ప్లీజ్" ప్రాధేయపడింది భాను. ఆ అభిమానానికి కవితకు ఏమనాలో తోచలేదు.

"సరే! నేను నిన్ను అడగనే అడగను. నువ్వే నేనెప్పుడు వెళ్ళాలో చెప్పు" అంది కవిత నవ్వుతూ.

"థాంక్యూ కవీ డార్లింగ్" అంటూ కవితను ముద్దు పెట్టుకుంది భాను.

మరునటి రోజు మ్యాట్నీ సిన్మా చూసి అక్కడి నుండి శేఖర్ క్లినిక్‌కి వెళ్ళారిద్దరూ. హాస్పటల్ బిల్డింగ్ విశాలంగా పెద్దదిగానే వుంది. కొత్తగా కట్టినది కనుక చాలా నీట్‌గా కనబడుతోంది.

"రండి! రండి!" అంటూ ఆనందంగా ఎదురొచ్చాడు శేఖర్.


**S.T.D. CODE NO : 08855 - ఫోన్ నెంబరు 43208**

# శనిత్రయోదశి పర్వదినముల ప్రకటన

## శ్రీశ్రీశ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం

## మందపల్లి గ్రామం, కొత్తపేట మండలం, తూర్పుగోదావరిజిల్లా

1997-98 సంవత్సరములో వచ్చు శని త్రయోదశి పర్వదినములు ది. 27-12-97 మరియు 10-1-98 తేదీలలో శని త్రయోదశి పర్వదినములు శనివారములైయున్నందున మందపల్లి గ్రామములో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారికి ముఖ్యముగా శనివారం అందునా 'శనిత్రయోదశి' పర్వదినములలో భక్తులు శనిదోష పరిహారార్థం శ్రీ స్వామివారికి తైలాభిషేకములు చేసిన 'శని' వలన కలుగు సమస్తదోషములు నివారించబడునని స్కంధపురాణములో చెప్పబడినది. కావున భక్తులు 'శని' వలన కలుగు సమస్త దోషములు నిమ్మిత్తం తైలాభిషేకములు చేయించుకొనవలసిందిగా కోరుచున్నాము.

శ్రీ స్వామివారి సన్నిధికి స్వయముగావచ్చి తైలాభిషేకములు జరిపించుకోలేనివారు మనియార్డరు (M.O.) రూపములోగాని, కొత్తపేట ఆంధ్రాబ్యాంకు కోడ్ నెంబరు 0316 ద్వారాకాని, కొత్తపేట స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా కోడ్ నెంబర్ 0982 ద్వారాకాని, వెదిరేశ్వరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోడ్ నెంబరు 540030 ద్వారాకాని, రావులపాలెం స్టేట్‌బ్యాంకు అఫ్ హైదరాబాదు కోడ్ నెంబరు 2821 ద్వారా డి.డి. (D.D.) రూపములో ఈ క్రింది భాగములో ఉదహరించిన రేట్ల ప్రకారముగా దేవస్థానమువారికి సొమ్మును పంపించినయెడల మీ యొక్క గోత్రనామ ములతో శ్రీ స్వామివారికి తైలాభిషేకములు, పూజలు జరిపించి శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదములను పోస్టుద్వారా తమ అడ్రసునకు పంపబడును.

మనియార్డరు(M.O.) నందు క్రింది భాగమున, పైభాగమున రెండు కూపనులయందును ముఖ్యముగా సమాచారము తెలుపు స్థలములో మీయొక్క పేరు, గోత్రము, మీయొక్క అడ్రసు (చిరునామా) మరియు అభిషేకములు జరిపించవలసిన తేదీ మొదలగు అన్నివివరములు తెలుగులో ''స్పష్టముగా'' విడివిడిగా తెలియునట్లు వ్రాయవలయును. మనియార్డరు కూపనులయందు రెండుచోట్ల మీ యొక్క అడ్రసు లేని యెడల ప్రసాదము కవరు మీ అడ్రసుకు చేరుట కష్టము.

ఈ క్రింది తెలిపిన తైలాభిషేకములకు, పూజలకు రేట్లు ఒక్కసారి జరిపించుట కు మాత్రమే నిర్ణయించబడినది.

| | ఒక్కసారి పూజకు మాత్రమే రేటు | శాశ్వతాభిషేకములకు రేట్లు |
|---|---|---|
| 1) ఏకాదశి రుద్రాభిషేకం తైలంతో | 60-00 | 600-00 |
| 2) మహాన్యాస పూర్వక తైలాభిషేకమునకు | 40-00 | 400-00 |
| 3) లఘున్యాస పూర్వక తైలాభిషేకమునకు | 25-00 | 250-00 |
| 4) ఉదకాభిషేకమునకు | 25-00 | 250-00 |
| 5) సహస్రనామార్చనకు | 25-00 | 250-00 |
| 6) అష్టోత్తర నామార్చనకు | 12-00 | 125-00 |

గమనిక : శాశ్వతాభిషేకములు సంవత్సరములో ఒకరోజు మాత్రమే మీరు తెలిపిన తేదీనగాని, తిథిగాని, ప్రతి సం॥ము సంవత్సరమునకు ఒక్కసారి చొప్పున జరుపబడును. శాశ్వత అభిషేకముల నిమ్మిత్తం చెల్లించే సొమ్ముబ్యాంకునందు '' ఫిక్సిడ్ డిపాజిట్ '' చేసిన సంవత్సర కాలము అయిన తదుపరి దానిపై వచ్చు వడ్డీతో అభిషేకములు జరుపబడును. ఈ సంవత్సరములో జరుపవలసిన అభిషేకములకు సొమ్మును అదనముగా పంపవలయును.

ముఖ్యగమనిక : (1) సదరు పై అభిషేకములకు, పూజలకు సొమ్ము వసూలు చేయుటకు రాష్ట్రంలో ఎక్కడా ఏజెంట్లుగాని, ప్రతినిధులుగాని మా దేవస్థానం తరపున నియమించియుండలేదు. (2) శ్రీ స్వామివారి దేవస్థానము '' చెక్కులు '' అంగీకరించబడవు.

రూటు : రావులపాలెం నుండి అమలాపురం (లేక) రాజోలు పోవు మార్గంలో రావులపాలెంనకు 6 కి॥మీ దూరములో మందపల్లి గ్రామము కలదు. మరియు రాజమండ్రి రైల్వేస్టేషన్ నుండి 38 కి॥మీ దూరము కలదు.

చిరునామా : **కార్యనిర్వహణాధికారి**
**శ్రీశ్రీశ్రీ మందేశ్వరస్వామివారి దేవస్థానం**
**మందపల్లి గ్రామము, కొత్తపేట మండలం**
**పిన్‌కోడ్ నెంబరు 533 238**
**తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్**

ఇట్లు
భవదీయుడు
కోళ్ళ సత్యనారాయణ
కార్యనిర్వహణాధికారి

విశాఖ యాడ్స్, రాజమండ్రి.

ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక
1997 దీపావళి
ప్రత్యేక సంచిక

బోయ్‌ని పిలిచి ఇద్దరికీ కూల్ డ్రింక్స్ తెప్పించాడు. ఆరయ్యింది. పేషెంట్స్ రావడం ప్రారంభించారు. తనకు అటూ ఇటూ ఇద్దరికీ చైరో ఛెయిరూ వేయించాడు. "మీ కాలేజీ విశేషాలు చెప్పరా భానూ" అన్నాడు మేనకోడల్ని అభిమానంగా చూస్తూ.

"అబ్బాయిలు మిమ్మల్నేడిపిస్తారా? మీరే వాళ్ళనేడిపిస్తారా!" మేనకోడలంటే ఎంత గారం! నిజంగా ఇలాంటి మావయ్యొకడు వుంటే ఎంత భరోసాగా వుంటుందో! తోబుట్టువులు లేని భానుకి నిజంగా ఇతను అన్నలాంటి వాడే" అనుకుంది కవిత.

"ఎలా అయినా మీరు చాలా కామ్ అనుకుంటాను. అందుకే మా భానూకి నచ్చుంటారు." కవితవైపు తిరుగుతూ అన్నాడు.

సడన్‌గా భానూ లేచి "ఈ పక్క బిల్డింగ్ లో నా హైస్కూలు ఫ్రెండ్ వుంటుంది. చూసొద్దామా కవీ?" అంది.

"నువ్వెళ్ళిరా! నేనిక్కడే వుంటా" నంది కవిత. భానూ వెళ్ళిపోయింది.

"అయిదు నిమిషాల్లో వస్తా" నంటూ.

"అమ్మాయిలు మీలా నెమ్మదిగా వుంటే నాకిష్టం" కవిత వైపు ప్రత్యేకంగా చూస్తూ అన్నాడు శేఖర్. మొహమాటంగా నవ్వింది కవిత.

"మీరిప్పుడు ఏం సినిమా చూశారు? మీకే హీరో ఇష్టం!" అడిగాడు.

"అలాంటిదేం లేదు. ఏదో టైమ్ పాస్ కోసం చూడడమే!" అందామె.

శేఖర్ పక్కన కూర్చున్న కవితను చూసి ఎదురుగా వున్న పేషెంట్ అంటున్నాడు. "అమ్మగారు కూడా డాక్టరా బాబూ! చాలా సంతోషం బాబూ!"

శేఖర్ మొహంలో ఆనందపు మెరుపులు కనిపించాయి కవితకు.

"నమస్కారం అమ్మా! మీరిద్దరూ నూరేళ్ళు చల్లగా వుండండి" అన్నాడతను వెళ్ళిపోతూ. కవిత ఇబ్బందిగా కదిలింది. శేఖర్ వెంటనే కాదని చెబితే బావుండేది కదా అనిపించిందామెకు.

"నేనిన్ని రోజులూ లైఫ్‌లో ఏదో మిస్ అయ్యాననుకునేవాణ్ణి. అదేమిటో సరిగ్గా ఇప్పుడే ఈ పేషంట్ అంటే తెలిసింది" అన్నాడు శేఖర్ దిగులుగా.

అర్థం కానట్టు చూసింది కవిత. "మిమ్మల్ని రెండేళ్ళ క్రితం కలుసుకోకపోవడం నా బాడ్‌లక్, ఏం చేస్తాం. లైఫీజ్ లైక్ దట్" అన్నాడు. నిట్టూరుస్తున్నట్టుగా కవితను అలవోకగా చూస్తూ.

ఇదేం సంభాషణ! మేనకోడల్ని చిన్న పిల్లలా ముద్దు చేస్తున్నప్పుడు నన్ను కూడా అలాగే చూడాలి. కానీ ఇలా మాట్లాడడం ఏమీ బాగాలేదు." అనిపించింది కవితకు. అతని మాటలకి ఏ విధమైన స్పందనా చూపకుండా కూర్చుంది. తల వంచుకుని గోళ్ళు చూసుకుంటూ.

ఇంతలో భానూ రావడంతో వాతావరణం తేలికగా మారిపోయింది. శేఖర్ ఎప్పట్లానే నవ్వుతూ వున్నాడు. ఆ విషయం రాత్రి పడుకున్నప్పుడు మళ్ళీ గుర్తొచ్చింది కవితకు. "పోనిద్దూ! ఏదో సరదాగా అనుంటాడు. అయినా రెండు రోజుల్లో వెళ్ళిపోయేదాన్ని. వాళ్ళ అంతర్యాలు నాకెందుకు? అనుకుంటూ నిద్రపోయింది.

మర్నాడు భానూ తల్లి కూడా షాపింగ్‌కు వచ్చింది వారితో. కవితకొక మంచి చీర తీసుకుంది. అక్కడి నుండి ఆవిడ "మీరిద్దరూ క్లినిక్‌కి వెళ్ళండి. నేను ఇంటికి వెళతానంటూ వెళ్ళిపోయింది. కవితకు కూడా ఇంటికి వెళ్ళిపోవాలనిపించింది.

కానీ భానూకి క్లినిక్ వెళ్ళాలనుందని మాట్లాడకుండా ఊరుకుంది. "కమాన్ యంగ్ గాల్స్" అంటూ సాదరంగా పిలిచాడు శేఖర్ ఇద్దర్నీ.

"ఈ రోజు మీకు కేక్స్, ఐస్ క్రీమ్స్ తెప్పించాను" అంటూ ఫ్రిజ్‌లో నుంచి తీసి వారి ముందుంచాడు.

"థాంక్యూ వెరీమచ్ మావయ్యా" అంటూ ఆనందంగా వాటినందుకుంటూ "బైది బై" మన కవికి కారం, పులుపు పడదు. మసాలా తింటే గుండెల్లో నొప్పి కూడా వస్తుంది. కొంచెం చూడరాదూ" అంది భానూ.

"ఇప్పుడొద్దులెండి. ఇంకోసారి చూద్దాం" అంటూ తప్పించుకోబోయింది కవిత. ఇంకోసారి వచ్చేటప్పటికి తగ్గిపోవాలి అందుకే ఇప్పుడు" అంది భాను.


"మీరొకసారి లోపల బల్లమీద పడుకోండి కవితా?" అన్నాడు శేఖర్. కవిత తలూపి స్క్రీన్ వెనుకకు వెళ్ళి బల్లపై పడుకుంది. "భానూ కూడా వస్తే బావుండును" అనుకుంటూ. భానూ ఏదో పాట హమ్ చేసుకుంటూ అక్కడే కూర్చుంది. శేఖర్ వచ్చి కవిత పొట్టంతా నొక్కి "నొప్పి వుందా?" అని అడిగాడు. అతడు తనని తాకుతున్నప్పుడు ఏదో అపురూపమైన అనుభూతిని పొందినట్లుగా కనిపించాడు కవితకు. చిత్రంగా చూసిందామె "లేదు" అంది నెమ్మదిగా.

ఈసారి గుండె భాగంలో బాగా నొక్కి అడిగాడు. "నొప్పి వుందా?" అని. ఈసారి తల బాగా కిందికి వంచుకుని తన ఫీలింగ్ దాచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్టు కనబడ్డాడు. నొప్పి లేదంది కవిత. ఆమె చెయ్యి తీసుకుని పల్స్ చూస్తూ అతని గుండెలపై పెట్టుకుని తాదాత్మ్యంతో కళ్ళు మూసుకున్నాడు. తల తిప్పి చూసిన కవితకు తన చెయ్యి సరిగ్గా అతని గుండెలపై వుండడం కనిపించింది.

"ఇదేమిటి? ఇతనుకొంచెం మిస్ బిహేవ్ చేస్తున్నాడు" అనుకోకుండా వుండలేకపోయింది. ఆ భావం కలగగానే చటుక్కున చెయ్యి లాక్కుంది. శేఖర్ ఉలిక్కిపడి సర్దుకుని "కమాన్" అంటూ తన సీట్‌వైపు నడిచాడు.

"మీ ఫ్రెండ్‌కి గుండె నొప్పి కాదు ఏం కాదు. అది గాస్ వల్ల వచ్చింది. ఎసిడిటీ ఉన్నట్టుంది. నేను యాంటాసిడ్ టాబ్లెట్స్, సిరప్ రాసిస్తాను. కారం, పులుపూ తగ్గిస్తే చాలు సరిపోతుంది" అంటూ ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు. ఇద్దరు బయలుదేరి వచ్చేస్తుంటే "రేపు కూడా వస్తారు కదూ!" కవితవైపు అభ్యర్థనా, ఆరాధనా కలగలిపిన చూపు చూస్తూ అన్నాడు.

ఆ తర్వాతి రెండు రోజులూ క్లినిక్‌కి పోకుండా మానేజ్ చేసింది కవిత. ఆ రోజు పడుకోబోయే ముందు



## ఆశ–నిరాశలు

నిన్ను చూడాలని
నిన్ను చేరాలని
కలలెన్నో కన్నాను
ఆశ అనే కడలిలో
మిగిలింది
జీవితనౌక నిరాశలా
ఆశ నిరాశల నడుమ
ఊగిసలాడుతున్నది బ్రతుకు
కెరటం తీరం చేరునా తుదకు
జీవితం వసంతంలా విరిసింది
ఒకనాడు
కాలగమనంలో
గ్రీష్మమై నిలిచింది ఈనాడు
కాలానికి నాపై కోపమా?
ఇది ప్రకృతి పెట్టిన శాపమా?

నస్రీన్ బేగం

చెప్పింది భానూ రేపటికి కవితకు ఏలూరుకి టికెట్ బుక్ చేసినట్టు.

"థాంక్యూ భానూ" చాలా రిలాక్స్‌డ్‌గా ఫీలయ్యింది కవిత.

"కానీ నువ్వు వెళ్ళేవరకూ నన్ను బోలెడు కబుర్లు చెప్పనివ్వాలి మరి"

"నాక్కొంచెం దూది తెచ్చిస్తే. పెట్టేసుకుంటాను. ఆ తర్వాత నువ్వెంత సేపు చెప్పినా నాకభ్యంతరం లేదు" నవ్వాపుకుంటూ అంది కవిత.

"మా మావయ్యని చూసి నువ్వు కూడా నా మీద జోక్స్ వేస్తున్నావ్ కదూ! సర్లేగానీ మరి మావయ్యకు ఎప్పుడు చెబుతావ్ వెళ్ళిపోతున్నానని?" అడిగింది భానూ.

"రేపు చెబుదాంలే" అని దాటవేసింది కవిత. లేకపోతే మావయ్యాని ప్పుడు రమ్మని ఫోన్ చేస్తుందేమో అని భయపడి.

మర్నాడు మధ్యాహ్నం మళ్ళీ గుర్తు చేసింది భానూ.

"నువ్వే చెప్పేద్దూ!" అనేసింది కవిత.

బస్ ఎక్కిస్తూ "రీ ఓపెనింగ్ రోజుకి వచ్చేస్తావ్ కదూ!" భానూ అడిగింది. తలూపింది కవిత భానూ చెయ్యి నొక్కుతూ.

ఏలూరులో కవిత రిక్షా దిగగానే తమ్ముడొచ్చి ఎయిర్ బాగ్ అందుకున్నాడు. "ఉన్న పది రోజులు శలవుల్లో వారం రోజులు అక్కడే వుంటావా?" మందలించింది కవిత తల్లి. "ప్రతి రోజూ చూస్తూనే వున్నాం వచ్చేస్తావని" పల్కరించాడు తండ్రి. నాలుగు రోజులు తల్లిదండ్రులతో గడిపి తిరిగి వచ్చేసింది కవిత. భానూ కూడా వచ్చేసింది.

"ఆ రోజు క్షేమంగా వెళ్ళిపోయావా? మీ అమ్మా, నాన్న ఏమన్నారు?" అడిగింది భానూ కవితను చూస్తూనే.

"వెళ్ళిపోయాను. మా వాళ్ళు బాగా తిట్టారు. వారం రోజులున్నానని" నవ్వింది కవిత.

"మా అమ్మా, నాన్నా మాత్రం నువ్వు చాలా కుదురైన పిల్లవని మెచ్చుకున్నారు. మావయ్య తనికి చెప్పకుండా వెళ్ళిపోయినందుకు హర్ట య్యాడు తెలుసా! నీ బయోడేటా అంతా ముందే చెప్పానులే. దాన్ని బట్టి తను నీకొక మంచి మాచ్ చూశాడు. మీ వాళ్ళే తనకి తెలిసిన వాళ్ళట. ఆ అబ్బాయి కాలేజీ లెక్చరరట. కట్నం ఏమీ వద్దట. పెళ్ళి కొడుకు ఎడ్రస్, డిటెయిల్సూ అన్నీ రాసి ఇచ్చాడు. ఇప్పడా వివరాలున్న కాగితం మీ ఇంటికి పంపుదాం. ఎడ్రస్ రాయి" అంటూ కవర్ తెచ్చింది భానూ.

కవిత ఎడ్రస్ రాసింది. చిన్నకాగితం మీద లెటర్ రాసి పెళ్ళి కొడుకు వివరాలున్న స్లిప్ పిన్ చేసి పోస్ట్ చేసి వచ్చి "అమ్మయ్య! మా అమ్మ చెప్పిన పనిచేశాను" అని నిట్టూర్చింది భానూ.

"రాను రానని పోజ్ కొట్టావ్! ఇప్పుడు నీకేం లాభించింది చూస్కో" అంటూ కవితను ఆట పట్టించడం మొదలు పెట్టింది భానూ.

కవితని ఆలోచనలు చుట్టుముట్టాయి. శేఖర్‌ని పెద్దగా తలచి అతన్నెలా తప్పించుకు తిరిగిందీ తల్చుకుంటే కవితకు మనస్సు కలుక్కుమంది. అతనెంతో పెద్ద మనసుతో ప్రవర్తించి తన గొప్పతనాన్ని చాటుకున్నాడు. తను చిన్న మనసుతో ఆలోచించి శేఖర్‌ని అపార్థం చేసుకుంది. అతన్ని తక్కువగా అంచనా వేసి అతనికి చెప్పకుండా వచ్చేసింది. తనెంత తెలివి తక్కువగా ప్రవర్తించిందీ తల్చుకుంటే సిగ్గేస్తోంది. తనకి త్వరలో పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారని భానూ చెప్పి వుంటుంది. అతడు తనకి చూపించిన మాచ్ కుదరనీ, కుదరకపోనీ అది వేరే విషయం. కానీ శేఖర్ చూపించిన అభిమానం మాత్రం మరవలేనిది. కవితకు అప్రయత్నంగా కళ్ళు చెమర్చాయి.

** ** **

సినిమాల్లో, కథల్లోలా చెడ్డవాళ్ళు, మంచివాళ్ళు అంటూ నిజ జీవితంలో విడివిడిగా వుండరు. పెద్ద మనుషుల్లా చలామణీ అయ్యే ఎందరో ప్రబుద్ధులు అదను దొరికితే ముసుగు తొలగించుకుని తమ తుచ్ఛమైన కోరికలను తీర్చుకోవడం కోసం తమ అల్పత్వాన్ని బైట పెట్టుకుంటారు. ప్లాన్ బెడిసి ఆశించింది దొరకదని తెలియగానే తిరిగి పెద్ద మనిషి బురఖా తక్కున తగిలించుకుని హోదా వెలిగించుకుని ముందుకు బహుదర్జాగా సాగిపోతారని తెలుసుకునేంతగా కవిత ఎదగలేదు మరి.




## హైకూలు

## ప్రకృతి-వికృతి

నేనెవరురా
వెంకట చలం ప్రశ్న
బ్రాహ్మడివిరా

నీ వెవరురా
నేను దళితుణ్ణిరా
కనబడ్డంలే

సెక్సు ఏమిటి
మాకు కావాల్సినది
అంది స్త్రీ లోకం

బిడ్డను పెంచు
కన్నాగా పెంచలేను
శక్తి యివ్వలే

ప్రేమ ఎక్కడ
అందరిలో వుందిగా
దొరకదేమి

శృంగారం కామం
వాటిల్లో తేడా ఏంటి
తెలిసికోవేం

కోరిక తీరా
నాకు ఓ స్త్రీ కావాలి
ఆమె కెందుకు

ఆనంద మంటే
వాడికి తెలియదు
నేనే కావాలా

సెక్సు సైన్సులు
వచ్చాయి అందరికి
కొనుక్కోవచ్చు

ఎవరెవరు
ఎందుకో కలయిక
వికృత చేష్ట

(జపాన్ "హైకూ"లకు సిసలైన నిర్వచనం తెలుగు వాళ్ళకి చెప్పిన నారాయణ రెడ్డి గారికి అభినందనలతో) డాలీ, తిరుపతి.